WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 359 గురువారం 14-5-2026 | పేజీలు : 4 | వెల : 5-00



## ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటు

- హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ
- ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌లకు ఔటర్ రింగురోడ్లు
- నల్లగొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్
- ఆదిలాబాద్, బాసర, కడెం మధ్య టూరిజం కారిడార్
- మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్ల కేంద్రంగా ఒకటి,
- సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచకు మరొకటి..
- వచ్చే 25 ఏళ్లకు సరిపోయేలా వీటిని డిజైన్ చేయాలి
- ఇంధన ఖర్చు తగ్గింపులో భాగంగా ఈవీలనే వాడాలి
- 600 మందితో అమెరికా వెలుపల తొలి కేంద్రం
- మున్సిపాలిటీల్లో సౌర విద్యుత్ ప్లాంట్లు: సీఎం రేవంత్

హైదరాబాద్, **నవతరం** రాష్ట్ర వ్యాప్తంగా మెగా గ్రోత్ కారిడార్లు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వచ్చే 25 ఏళ్లకు సరిపడేలా వీటిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ)లో మెగా గ్రోత్ కారిడార్లపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ ఖమ్మం, వరంగల్, కరీంనగర్ నగరాల చుట్టూ ఔటర్ రింగు రోడ్ల (ఓఆర్‌ఆర్)ను ఏర్పాటు చేయాలని, అవసరమైన మేర మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) నిర్మించాలని ఆదేశించారు. ఈ కారిడార్ భవిష్యత్‌లో తెలంగాణకు చాలా కీలకమని సీఎం పేర్కొన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతాల్లో రోడ్లను నిర్మించాలని సూచించారు. అలాగే, సుజాతనగర్, కొత్తగూడెం, పాల్వంచను కలుపుతూ ఒక కారిడార్, మహబూబ్‌నగర్, భూత్పూర్, జడ్చర్లను కలుపుతూ మరొక కారిడార్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీటితోపాటు నల్లగొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్, ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టును కలుపుతూ టూరిజం కారిడార్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు కానుందని, వరంగల్‌లోని మామునూరులో ఎయిర్‌పోర్టు నిర్మించనున్నామని.. వీటిని దృష్టిలో ఉంచుకుని రోడ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణంలో సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు.

మిగతా 2లో

## బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

- పశువుల అక్రమ రవాణాపై నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టుల ఏర్పాటు
- ఘర్షణలు తలెత్తకుండా కఠిన చర్యలకు ఆదేశం
- అధికారులతో డిజిపి సివి ఆనంద్ వీడియో




హైదరాబాద్,**నవతరం**

ఈ నెల 27వ తేదీన జరిగే బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించాలని పోలీస్ అధికారులను డిజిపి సివి ఆనంద్ ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో పుకార్లు పుట్టించే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో బక్రీద్ పండుగను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణెలి లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోందని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, పశుసంవర్ధక శాఖ సెక్రటరీ కే.

- మిగతా 2లో

## ఎపిలో డిజిటల్ కనెక్టివిటీ పెంపు

- బిఎస్ఎన్ఎల్‌తో ఎపి ప్రభుత్వం ఒప్పందం
- హైస్పీడ్ ఇంటర్‌నెట్ సరఫరాతో గ్రామాలకు మేలు




## పుదుచ్చేరి సిఎంగా రంగస్వామి ప్రమాణం

- వరుసగా ఐదోసారి సిఎంగా బాధ్యతలు
- ప్రమాణ కార్యక్రమానికి నితిన్ నబీన్ హాజర్
- ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు




పుదుచ్చేరి,**నవతరం** కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రం గస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. లోక్ భవన్‌లో లెఫ్టినెంట్ గవర్నర్ కె. కైలాసనాథన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. నమశ్శివాయం, మల్లాడి కృష్ణారావు కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. పుదుచ్చేరిలో ఐదోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఎన్.రంగస్వామి రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు, మిత్రపక్షాల నేతలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు.

- మిగతా 2లో పేజిలో



## విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్

- తమిళనాడు అసెంబ్లీలో 144 మంది మద్దతు
- విశ్వాస పరీక్షను బహిష్కరించిన డిఎంకె
- అనాడిఎంకె చీలిక వర్గం టివికెకు అనుకూల ఓటు
- ప్రజల విశ్వాసాన్ని కాపాడుకుంటామన్న సిఎం విజయ్

మిగతా 2లో


## 20 లక్షల ఉద్యోగాల లక్ష్య సాధనకు ఎంఎస్ఎంఈలు కీలకం

- 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు, 24 లక్షల
- ఉద్యోగాలు కల్పించే 800 ప్రాజెక్టులతో ఒప్పందాలు
- మూడు నెలల్లో 100 కంపెనీలు ఎన్ఎస్ఈలో లిస్ట్
- అయ్యేలా ఎంఎస్ఎంఈ శాఖ పని చేయాలి

మంత్రి నారా లోకేష్



2లో



2లో

## భారత్‌కు ఇంధన కొరత రానివ్వం

- సరఫరాలో లోటు రాకుండా చూస్తాం
- రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హామీ

## చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం



కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను తగ్గించిన ప్రధాని

అదేబాటలో హోంమంత్రి అమిత్ షా

పలు రాష్ట్రాల సిఎంలు కూడా పొదుపుబాట

2లో

# విశ్వాస పరీక్షలో నెగ్గిన విజయ్




చెన్నై,మే13 తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది‘ అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్‌డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది. అంతకు ముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు. ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ‘ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు.

# ఎపిలో డిజిటల్ కనెక్టివిటీ పెంపు

న్యూఢిల్లీ,మే13 ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ కనెక్టివిటీని మరింత విస్తరించే దిశగా కీలక ముందడుగు పడింది. భారత్ నెట్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం, బీఎస్ఎన్ఎల్, ఆంధప్రదేశ్ ప్రభుత్వం మధ్య చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధమయ్యాయి. భారత్‌నెట్ ఒప్పందంతో రాష్ట్రంలో డిజిటల్ విప్లవానికి మరింత వేగం రానుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ అసమానతలను తగ్గించడం, ప్రజలకు సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించడం వంటి లక్ష్యాలకు ఈ ప్రాజెక్టు తోడ్పడనుంది. డిజిటల్ ఇండియా లక్ష్యాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలవనుందని అధికారులు భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో 'సవరించిన భారత్‌నెట్ ప్రోగ్రామ్' అమలుకు కేంద్ర ప్రభుత్వం రూ.2,432 కోట్ల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఈ నిధులు డిజిటల్ భారత్ నిధి ద్వారా విడుదల కానున్నాయి. ఈ ప్రాజెక్టు అమలుతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు వేగవంతం కావడంతో పాటు టెలికాం మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి. కొత్త ఒప్పందం ప్రకారం ఆంధప్రదేశ్‌లోని 13,426 గ్రామ పంచాయతీలకు హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించనున్నారు. ÷బైర్ నెట్ నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా గ్రామీణ ప్రజలకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రత్యేకంగా విద్య, వైద్యం, వ్యవసాయం, ఈ-గవర్నెన్స్ సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత సులభంగా చేరేలా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న 3,942 గ్రామాలకు 'ఆన్-డిమాండ్ కనెక్టివిటీ' సౌకర్యం కల్పించనున్నారు.

# చమురు సంక్షోభంతో పొదుపు మంత్రం

న్యూఢిల్లీ,మే13 పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా గత కొంతకాలంగా ముడి చమురు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. చమురు దిగుమతులపై ఆధారపడ్డ అనేక దేశాల్లో సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారతీయులు కూడా వృథా ఖర్చులు తగ్గించుకుని పొదుపు చర్యలను చేపట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ప్రధాని పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ప్రధాని తన కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను సగానికి తగ్గించాలని ఆదేశించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అంతేకాకుండా, విద్యుత్ కార్ల వినియోగాన్ని పెంచాలని కూడా ప్రధాని సూచించినట్టు తెలుస్తోంది. మీడియా కథనాల ప్రకారం, కాన్వాయ్‌లోని కార్ల సంఖ్యను 50 శాతం మేర తగ్గించాలని ప్రధాని భద్రత దళం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్‌కు (ఎస్పీజీ) ఆదేశాలు అందాయి. భద్రతా ప్రొటోకాల్ పాటిస్తూనే పొదుపు చర్యలు చేపట్టాలని ఎస్పీజీకి సూచనలు వెళ్లినట్టు సమాచారం. ఈ దిశగా ఎస్పీజీ కార్యాచరణ మొదలెట్టినట్టు కూడా తెలుస్తోంది. తన కాన్వాయ్‌లో విద్యుత్ కార్ల సంఖ్యను పెంచేందుకు కూడా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ సూచించినట్టు తెలుస్తోంది. ఇందుకోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్లనే వినియోగించాలని, కొత్తవి కొనవద్దని కూడా ప్రధాని స్పష్టం చేసినట్టు సమాచారం. ఇకపోతే హోంమంత్రి అమిత్ షా కూడా తన కాన్వాయ్‌లో వాహనాలను తగ్గించుకున్నట్లు వెల్లడించారు. ఇప్పుడున్న కాన్వాయ్‌లో దాదాపు సగం వరకు తగ్గించారని సమాచారం. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా ఈ తరహా పొదుపు చర్యలకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తోంది. ఇంధన పొదుపు కోసం ఏయే చర్యలు తీసుకోవాలనే దానిపై పలు శాఖలు సమీక్షలు జరుపుతున్నాయి. ఇక మధ్యప్రదేశ్, రాజస్థాన్ సీఎంల కాన్వాయ్ కుదింపునకు కూడా సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం.

# ఫ్యూచర్ సిటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ ఏర్పాటు



నగరాలే కేంద్రంగా అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని సూచించారు. పట్టణాలు, నగరా ల్లో రేడియేషన్ ప్రభావాన్ని తగ్గించడానికి మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలని, ఇందుకోసం ప్రతీచోట స్మార్ట్ పోల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సీవరేజ్ అండ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి శుద్ధి చేసిన నీటినే భవన నిర్మాణాల్లో ఉపయోగించేలా నిబంధన పెట్టాలని ఆదేశించారు. పెద్ద మునిసిపాలిటీల సమీపంలో రేడియల్ రోడ్లు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వీటిని ఆయా నగరాలు, పట్టణాల జనాభాకు తగినట్టు డిజైన్ చేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగంపై సాంకేతిక నిపుణుల సలహా తీసుకోవాలన్నారు. ఇంధన ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టాలని, లీజుకు తీసుకునేవి కూడా ఈవీలే ఉండాలని సీఎం ఆదేశించారు. మునిసిపాలిటీల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. సింగరేణి పరిధిలో ఉన్న అన్ని మునిసిపాలిటీలను ఒక యూనిట్‌గా తీసుకుని, సీఎ?సఆర్ నిధులను ఖర్చు చేయాలన్నారు.

సీఎంను కలిసిన లోకాయుక్త

తెలంగాణ లోకాయుక్త జస్టిస్ రాజశేఖరరెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఈఈపీసీ) రీజినల్ చైర్మన్ రామన్ రఘు, రీజినల్ డైరక్టర్ జె.వి. రాజగోపాలరావు, సైనిక్ సంక్షేమ శాఖ డైరక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్ బాబు కూడా సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణపై యాక్షన్ ప్లాన్

ఏపీలో సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు జరగకుండా బ్యాంకులు తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై రిజర్వు బ్యాంకును సంప్రదించాలని సీఎం సూచించారు. ఆర్థిక, సైబర్ నేరాల్లో ఇన్వెస్ట్ మెంట్ ఫ్రాడ్స్ పెద్ద ఎత్తున జరుగుతున్నాయనే అంశంపై సీఎం కొన్ని సూచనలు చేశారు. ఆధార్ ఆథంటికేషన్, కేవైసీ లాంటివి లేకుండా షెల్ కంపెనీలను కొందరు ప్రారంభిస్తున్నారని ఇలాంటి ఘటనలపై అధ్యయనం చేయాలన్నారు. బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖలు సమన్వయంతో ఆన్ లైన్ ఆర్థిక మోసాల విషయంలో ఓ నియామవళిని సిద్ధం చేయాలని సీఎం నిర్దేశించారు. అనుమానిత మ్యూల్ బ్యాంకు ఖాతాలను ఫ్లాగ్ చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సైబర్, ఆర్థిక నేరాల్లో ఖాతాదారుల ప్రయోజనాలు రక్షించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.యూపీఐ పేమెంట్స్ ద్వారా మిలియన్ల సంఖ్యలో ఆర్థిక లావాదేవీలు క్షణాల్లో జరుగుతున్నాయని ఈ నేపథ్యంలో గోల్డెన్ అవర్ ఫండ్ రికవరీ అంశంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై మరిన్ని సాంకేతికపరమైన నూతన ఆవిష్కరణలు రావాల్సి ఉందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. సైబర్ నేరాల నియంత్రణలో ఏపీటీఎస్ ముఖ్య భూమిక పోషించాలని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో టెక్నాలజీలను అధ్యయనం చేయాలని సూచించారు. అన్ని బ్యాంకులు వారాంతాల్లో పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలపై దృష్టి పెట్టాలన్నారు. కొన్ని నిబంధనల్ని మార్చుకునే విషయంలో రిజర్వు బ్యాంకును సంప్రదించాలన్నారు. రిజర్వు బ్యాంకు తీసుకువచ్చిన మ్యూల్ ఆకౌంట్ హంటర్ ఏఐ లాంటి టూల్స్ ను నకిలీ ఖాతాలను గుర్తించేందుకు వినియోగించాలన్నారు. హర్యాణా, మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాల్లో ఉత్తమ విధానాల్ని అధ్యయనం చేసి ఓ నిర్దుష్టమైన కార్యాచరణ సిద్ధంచేయాలన్నారు. దీంతో పాటు సైబర్, ఆన్ లైన్ ఆర్థిక మోసాలపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీలో సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించి 9.29 లక్షల కాల్స్ బాధితుల నుంచి 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదులు వచ్చినట్టు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివరించారు. సైబర్, ఆర్థిక నేరాల బారిన పడి ఏపీలో ఇప్పటి వరకూ రూ.652 కోట్లను బాధితులు కోల్పోయినట్టు తెలిపారు. సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం-బ్యాంకర్లతో కలిసి రూ.116 కోట్ల పైచిలుకు మొత్తాన్ని సైబర్ నేరగాళ్లకు చేరకుండా కాపాడగలిగామని స్పష్టం చేశారు. పిషింగ్, విషింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు,

ఆన్ లైన్ లోన్ ఫ్రాడ్స్ సహా డిజిటల్ అరెస్టుల్లో బాధితులు సొమ్మును కోల్పోతున్నట్టు అధికారులు తెలిపారు. సైబర్, ఆర్థిక నేరాల నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో సీఐడీ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పని చేస్తోందని విజయవాడ, విశాఖ, తిరుపతిలలో సైబర్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రికి వివరించారు. మరోవైపు ఏపీలో సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా డేటాకు రక్షణ కల్పిస్తున్నామని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ సీఎంకు వివరించారు. ఈ సమీక్షకు మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఏపీ ఫోరెన్సిక్స్ సలహాదారు కెపీసీ గాంధీ, రిజర్వు బ్యాంకు సహా వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# భారత్‌కు ఇంధన కొరత రానివ్వం

మాస్కో,మే13 ఇంధన సరఫరా విషయంలో భారత ప్రయోజనాలకు నష్టం జరగనివ్వబోమని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ హామీనిచ్చారు. ఇంధన సరఫరాకు సంబంధించిన ఒప్పందాలన్నింటినీ నెరవేర్చుతామన్నారు. త్వరలో భారత పర్యటనకు రానున్న లావ్రోవ్ ఓ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, రష్యాల మధ్య సంబంధాలు స్నేహంపై ఆధారపడి ఉన్నాయని, వాటి దారులు వేరయ్యే పరిస్థితి ఎప్పటికీ ఉండదని స్పష్టం చేశారు. ఇంధన సరఫరా విషయంలో భారత ప్రయోజనాలకు నష్టం జరగనివ్వం. చమురు సరఫరాలో ఆటంకం కలగనివ్వం. భారత అవసరాల దృష్ట్యా గ్యాస్, చమురు, బొగ్గు వంటివి సరఫరా చేస్తూనే ఉంటాం. భారత్-రష్యా బంధాలను బలహీనపరిచేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాల పట్ల ఇరు దేశాలు అప్రమత్తంగా ఉండాలి. కుడంకుళం అణు విద్యుత్ కేంద్రం కోసం కొత్త పవర్ యూనిట్ల నిర్మాణంలో మా సహకారం కొనసాగుతుంది’ అని లావ్రోవ్ తెలిపారు. హిందూ-రూసీ భాయ్ భాయ్ అనేది మన సంస్కృతిలో ఒక భాగం.

# 20 లక్షల ఉద్యోగాల లక్ష్య సాధనకు ఎంఎస్ఎంఈలు కీలకం



అమరావతి,

ఆంధ్రప్రదేశ్‌లో 20 లక్షల ఉద్యోగాల లక్ష్య సాధనలో ఎంఎస్ఎంఈల పాత్ర అత్యంత కీలకమని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మేడ్ ఇన్ ఆంధ్ర -- మేడ్ ఫర్ ఇండియా -- మేడ్ ఫర్ ది వరల్డ్ లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సిఐఐ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ఎంఎస్ఎంఈలకు మూలధన మార్కెట్ అవకాశాలపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో తనకు ఎదురైన ఒక సంఘటన 20 లక్షల ఉద్యోగాల లక్ష్యానికి ప్రేరణగా నిలిచిందని మంత్రి లోకేష్ తెలిపారు. “226 రోజులు, 3132 కిలోమీటర్లు నడిచిన యువగళం పాదయాత్రలో ఎన్నో కుటుంబాల కష్టాలు, ఆశలు, ఆకాంక్షలను దగ్గరగా చూశాను. ఒకరోజు పెనుగొండలో కియా వద్ద సెల్ఫీలు దిగేందుకు దారుణమైన ఎండల్లో 23 కి.మీ నన్ను జాతీయ రహదారిపై నడిపించారు. అక్కడే కియా అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న పద్మావతి అనే చెల్లి నాతో కలిసి నడిచింది. కియా, అనుబంధ పరిశ్రమలు రాకముందు ఆమె గృహిణి. బాగా చదువుకుంది కానీ ఉద్యోగం చేయలేదు. కియా అనుబంధ సంస్థలు వచ్చిన తరువాత కుటుంబ సభ్యులను ఒప్పించి ఉద్యోగంలో చేరింది. నెలకు రూ.30 వేలు సంపాదిస్తోంది. అప్పటివరకు భర్త మీద ఆధారపడిన ఆమె, ఇప్పుడు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని కూడా చూసుకుంటోంది. ఆమె కథ విన్న తరువాత నాకు ఉద్యోగ కల్పన ఎంత ముఖ్యమో అర్థమైంది.

# బక్రీద్ సందర్భంగా ప్రత్యేక చర్యలు

ఇలంబర్తి తదితరులతో కలిసి డీజీపీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిన చర్చలు, అనంతరం ఉప ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశ నిర్ణయాల మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. బక్రీద్ పండుగ ఇతర పండుగల కంటే అత్యంత సున్నితమైనదని, ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల పశువుల అక్రమ రవాణా ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు కోసమే ఈ వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణా విషయంలో కౌ స్లాటర్ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ యాక్ట్-1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ-1960 చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో 52 అంతరాష్ట్ర చెక్ పోస్టులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 203 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు డీజీపీ వెల్లడించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేయాలని, ముఖ్యంగా రానున్న 15 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగే పశువుల సంతలపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. చెక్ పోస్టుల వద్ద పశువుల రవాణాకు సంబంధించిన 'ఫీట్ టు ట్రాన్స్‌పోర్టేషన్', 'ఫిట్ టు స్లాటర్' వంటి ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పండుగ ముగిసే వరకు ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగాలని ఆదేశించారు.

# ఎక్సైజ్ చట్టాలకు, నిబంధనలకు విరుద్ధంగా విక్రహిస్తున్న మద్యం షాపులు వెంటనే తొలగించాలి

## సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్




కుత్బుల్లాపూర్, నవతరం: గండిమైసమ్మ చౌరస్తా నుండి మియాపూర్ వరకు మెయిన్ రోడ్డు పై ఉన్న మద్యం పాలసీలకి విరుద్ధంగా ఉన్న మద్యం షాపులను వెంటనే తొలగించాలని సిపిఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ పోలీసు సీఐకీ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ మద్యం పాలసీ ప్రకారం మెయిన్ రోడ్డులు, జాతీయ రహదారులో, గుడులు, పాఠశాలలకు కనీసం వంద మీటర్ల దూరంలో మద్యం విక్రహించాలి అని గుర్తు చేశారు. కానీ రహదారులో మద్యం పాలసీకి వెతిరేకంగా మెయిన్ రోడ్డుపై ఏదేచ్ఛగా మద్యం విక్రయలు కొనసాగుతున్నాయి అని అన్నారు. ముఖ్యంగా వి- లిక్కర్, చివాస్ వైన్ షాప్, స్పిరిట్ వైన్ షాప్, ఎస్వీడీ లిక్కర్ షాప్ తదితర మద్యం షాప్ల ఎక్సైజ్ పాలసీ, నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్నారు అని వారు అన్నారు. రీసెంట్గా వి-లిక్కర్ వైన్ షాప్ వద్ద రహదారి పై వెళ్తున్న ఒక షిఫ్ట్ కారు సడన్ గా వి-లిక్కర్ వైన్ షాప్ వద్ద ఆగడం వల్ల వెనక నుండి వస్తున్న వాటర్ ట్యాంక్ కారును బలంగా గుద్దడం వల్ల కారు వెనక భాగం డ్యామేజ్ అయింది. అలాంటి అనేక సంఘటనలు రహదారుల పై జరగడం సర్వసధారణం అవుతున్నాయి. తద్వారా అమాయకుల ప్రాణాలు పోతున్నాయి అని అన్నారు. కనుక మద్యం పాలసీ, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న మద్యం షాపులను వెంటనే తొలగించాలని, అలాగే నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్, ఇంద్రన్న కాలనీ, రాజీవ్ గృహకల్ప, సాయి నగర్, ఎన్టీఆర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ఇందిరమ్మ కాలనీ, తదితర ప్రాంతాలలోని మద్యం బెల్ట్ షాపులను వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నాకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యం

- పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల అనివార్యం
- ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,మే13 పశ్చిమాసియా ఉద్రిక్తతల ఫలితంగా చమురు ధరలు పెంచక తప్పదనిరిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇలానే కొనసాగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చన్నారు. స్విట్జర్లాండ్‌లో స్విస్ నేషనల్ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఎఓఈ) నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆయన మాట్లాడారు. ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగితే, ప్రభుత్వం ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదిలీ చేసే అవకాశం ఉందని గవర్నర్ అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించిందని, చమురు కంపెనీలు నష్టాలను భరిస్తూ ధరలను నియంత్రిస్తున్నాయని గవర్నర్ తెలిపారు. అయితే ఇది ఎంతకాలం సాధ్యమవుతుందనేది ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. చమురు ధరలు పెరిగితే అది దేశ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా వస్తువుల రవాణా ఖర్చులపై ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని

# ఆరోపణలే... తుది తీర్పు కాదు

- ఆధారాలు ఉంటే ఎవరికైనా శిక్ష తప్పదు
- నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు
- సోషల్ మీడియాలో కించపరిచే పోస్టులపై కోర్టును ఆశ్రయించే అవకాశం
- విచారణ పూర్తికాకముందే సోషల్ మీడియా తీర్పులు సరైంది కాదు
- చివరికి గెలిచేది హడావిడి కాదు... ఆధారాలతో నిలిచే నిజమే
- అరటాకు -- ముళ్ళు కథలో నిజం ఏది..?
- తెలంగాణను కుదిపేస్తున్న "భగీరథ" వివాదం
- వాస్తవాల కంటే వాదాలకే ఎక్కువ ప్రాధాన్యం.!



డా. నర్సింలు ఎల్లంపల్లి, సీనియర్ జర్నలిస్ట్,
9618997705

తెలంగాణలో ప్రస్తుతం ఒక సంఘటన చుట్టూ రాజకీయాలు, వదంతులు, మీడియా చర్చలు, సోషల్ మీడియా తీర్పులు గాలివానలా విస్తరిస్తున్నాయి. ఒకరు దీనిని క్రైమ్ స్టోరీ అంటున్నారు... ఇంకొందరు ఇది రియల్ స్టోరీ అంటున్నారు... మరికొందరు రాజకీయ స్టోరీగా మలుస్తున్నారు... చివరికి కొందరు "ఇది తల్లిదండ్రుల పెంపక లోపం కథ" అని తేల్చేస్తున్నారు. కానీ అసలు ప్రశ్న మాత్రం ఇంకా సమాధానం కోసం ఎదురుచూస్తూనే ఉంది. ముళ్ళు పోయి అరటాకు మీద పడ్డా... అరటాకు పోయి ముళ్ళ మీద పడ్డా... నష్టపోయేది అరటాకే, అనే పాత సామెతను ఇప్పుడు ఎవరి వాదనకు వారు అన్వయించుకుంటున్నారు. కొందరు అరటాకుదే తప్పు అంటున్నారు. మరికొందరు ముళ్ళదే బాధ్యత అంటున్నారు. ఇంకొందరు పరిస్థితులదే అసలు కారణమని చెబుతున్నారు. కానీ సమాజం మొత్తం ఒక విషయం మాత్రం మరిచి పోతోంది --- నిజం తెలుసుకోకముందే తీర్పు చెప్పడం కూడా ఒక ప్రమాదక రమైన సామాజిక వ్యాధి. కాలం మారింది. సంఘటన కంటే ప్రచారం వేగంగా పరిగెడుతోంది. నిజం బయటకు రావడానికి సమయం పడుతుంది కానీ వదంతి మాత్రం నిమిషాల్లో లక్షల మందిని చేరుతోంది. ఒక బైకు స్పీడుగా వచ్చి ఖరీదైన కారును ఢీకొంటే... అక్కడి జనాలు ముందుగా కారుదే తప్పు అంటారు. ఎందుకంటే ఈ రోజుల్లో భావోద్వేగం ఆధారంగా తీర్పులు ఎక్కువ, వాస్తవాల ఆధారంగా ఆలోచనలు తక్కువ. ఇలాంటి అంశాల్లో రాజకీయ రంగు పులిమి, తమకు అనుకూలంగా మలచుకోవడం కూడా కొత్త విషయం కాదు. ఎదుగుతున్న వారిపై రాళ్లు, రోళ్లు పడటం సహజమేనని కొందరు అంటుంటారు. మరికొందరు"ఇది మొత్తం రాజకీయ ఎంటర్టైన్మెంట్‌గా మారిపోయింది"అని విమర్శిస్తున్నారు. సోషల్ మీడియా యుగంలో ప్రతి ఒక్కరూ న్యాయమూర్తిలా మాట్లాడుతున్నారు. కానీ చట్టం మాత్రం ఆధారాలనే నమ్ముతుంది... అరుపులను కాదు. ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశం తల్లిదండ్రుల బాధ్యత. పిల్లలను కేవలం ప్రేమతో పెంచడం సరిపోదు, వారి ఆలోచనలు, స్నేహాలు, భావోద్వేగాలు, జీవన విధానం పైన కూడా పర్యవేక్షణ అవసరం. ఎందుకంటే "ఒక్క చేతితో చప్పట్లు రావు"అన్న సామెత ఇక్కడ కూడా వర్తిస్తుంది. ప్రేమలో పడటం ఒక్కరి వల్ల కాదు... ఇద్దరి మనసులు కలిసినప్పుడే ఆ బంధం ఏర్పడుతుంది. అలాంటప్పుడు ఒక్కరినే తప్పుబట్టడం న్యాయం కాదని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ అంశంపై డోలు వాయించే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. ఎవరి వేదికలో వారు తమ వాదనను వినిపిస్తున్నారు. కానీ సమాజం మాత్రం ఒక విషయం గుర్తుంచుకోవాలి --- సంచలనాల కంటే సత్యం శాశ్వతం. తాత్కాలిక హడావుడి ఎప్పటికైనా తగ్గిపోతుంది. చివరికి నిలిచేది నిజమే... గెలిచేది న్యాయమే అని సీనియర్ పాత్రికేయులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రైమ్ స్టోరీ... సారీ రియల్ స్టోరీ... సారీ రాజకీయ స్టోరీ...

### చివరికి సోషల్ మీడియా స్టోరీగా మారిన"భగీరథ" వివాదం

హైదరాబాద్, నవతరం: తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారిన బండి సాయి భగీరథ అంశం, వాస్తవాల కంటే వైరల్ కామెంట్లకే ఎక్కువ ప్రాధాన్యం! తెలంగాణ రాజకీయాలు, సోషల్ మీడియా వేదికలు, యూట్యూబ్ చర్చలు ప్రస్తుతం ఒకే అంశం చుట్టూ తిరుగుతున్నాయి. అదే "బండి సాయి భగీరథ" వివాదం. మొదట దీనిని కొందరు క్రైమ్ స్టోరీ అన్నారు. తరువాత"కాదు కాదు ఇది రియల్ స్టోరీ"అన్నారు. ఇంకొందరు "ఇది మొత్తం కల్పిత కథ" అన్నారు. అక్కడితో ఆగలేదు... చివరకు ఇది రాజకీయ స్టోరీగా, సోషల్ మీడియా స్టోరీగా మారిపోయింది. ఒక సంఘటన బయటకు వచ్చిన కొన్ని గంటల్లోనే సోషల్ మీడియాలో వందల కథనాలు పుట్టుకొస్తున్నాయి. ఎవరి వాదనకు వారు హీరోలు, విలన్లు నిర్ణయించేస్తున్నారు. ఆధారాల కంటే అభిప్రాయాలే ఎక్కువగా వైరల్ అవుతున్నాయి. నిజం కోర్టులో తేలకముందే సోషల్ మీడియా తీర్పులు వెలువడుతున్నాయి. ఈ అంశంలో రాజకీయ కోణం కూడా బలంగా కనిపిస్తోంది. కొందరు దీనిని ప్రత్యర్థుల కుట్రగా అభివర్ణిస్తుంటే... ఇంకొందరు "ఎదుగుతున్న వ్యక్తిని టార్గెట్ చేస్తున్నారు" అంటున్నారు. మరికొందరు మాత్రం "సోషల్ మీడియా యుగంలో సంచలనమే అసలు వ్యాపారం అయిపోయింది" అని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ప్రతి యూట్యూబ్ ఛానల్, ప్రతి ఫేస్‌బుక్ పేజీ, ప్రతి వాట్సాప్ గ్రూప్ ఈ అంశాన్ని తమకు నచ్చిన కోణంలో చూపిస్తోంది. కొందరు న్యాయం కోసం మాట్లాడుతున్నామని చెబుతుంటే... ఇంకొందరు వ్యూస్ కోసం హడావిడి చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సీనియర్ విశ్లేషకులు మాత్రం ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తున్నారు --- "ఒక సంఘటనపై పూర్తి వాస్తవాలు బయటకు రాకముందే వ్యక్తిత్వ హత్య చేయడం సమాజానికి మంచిది కాదు" అంటున్నారు. సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ప్రతి విషయం నిజం అవాల్సిన అవసరం లేదని హెచ్చరిస్తున్నారు.ఇక ఈ వివాదం మరోసారి ఒక నిజాన్ని బయటపెట్టింది. ఈ రోజుల్లో సంఘటన కంటే దాని చుట్టూ తిరిగే ప్రచారమే పెద్దది. ఒక చిన్న విషయం కూడా క్షణాల్లో రాజకీయ రంగు పులుముకుని రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిపోతోంది. అయితే చివరికి గెలిచేది హడావిడి కాదు... ఆధారాలపై నిలిచే నిజమే అని పలువురు సీనియర్ పాత్రికేయులు అభిప్రాయపడుతున్నారు.

### "పోక్సో కేసు" అంటే ఏమిటి? సోషల్ మీడియాలో వినిపిస్తున్న ఈ పదం వెనుక అసలు చట్టం ఏమంటోంది.?

ప్రస్తుతం సోషల్ మీడియా, రాజకీయ వేదికలు, టీవీ డిబేట్లలో ఎక్కువగా వినిపిస్తున్న పదాల్లో "ఫోక్సో కేసు" కూడా ఒకటి. అయితే చాలామందికి ఈ పదం గురించి పూర్తి అవగాహన ఉండదు. కొందరు విన్నదాన్ని వేరేలా ప్రచారం చేస్తుంటారు. కానీ చట్టపరంగా చూస్తే "ఫోక్స్ కేసు" అనేది సాధారణంగా ప్రేమ, మోసం, శారీరక సంబంధాలు, వివాహ హామీలు, లేదా వ్యక్తిగత సంబంధాల చుట్టూ నమోదయ్యే తీవ్రమైన ఆరోపణలకు సంబంధించిన కేసులను సూచించే సామాన్య ప్రజల వాడుక పదంగా మారిపోయింది. భారతీయ చట్టాల ప్రకారం, ఒక మహిళ తనను మోసం చేశారని, పెళ్లి చేస్తానని నమ్మబలికి శారీరక సంబంధం పెట్టుకుని తరువాత తిరస్కరించారని ఆరోపిస్తే, పరిస్థితులను బట్టి పోలీసులు కేసు నమోదు చేస్తారు. అయితే ప్రతి ప్రేమ వ్యవహారం క్రిమినల్ కేసు అవుతుందా అంటే కాదు. ప్రతి ఆరోపణ నిజమవుతుందా అంటే కూడా కాదు. అందుకే చట్టం ఆధారాలు, పరిస్థితులు, ఉద్దేశాలు, ఇద్దరి మధ్య ఉన్న సంబంధం వంటి అంశాలను పరిశీలిస్తుంది.చట్టం ప్రధానంగా రెండు విషయాలను చూస్తుంది. బలవంతం జరిగిందా.? మోసం చేసి నమ్మకద్రోహం చేశారా.? ఒకరి అంగీకారం లేకుండా జరిగిన సంబంధం అయితే అది తీవ్రమైన నేరంగా పరిగణించబడుతుంది. కానీ ఇద్దరూ పరస్పర అంగీకారంతో సంబంధం కొనసాగించి, తరువాత విభేదాలు రావడం వంటి సందర్భాల్లో కోర్టులు పరిస్థితులను లోతుగా పరిశీలిస్తాయి. న్యాయ నిపుణులు చెబుతున్నది ఏమిటంటే --- ప్రేమ విఫలం కావడం ఒక్కటే క్రిమినల్ నేరానికి సరిపోదు. అదే సమయంలో "పెళ్లి చేస్తాను" అని ముందే మోసం చేసే ఉద్దేశంతో దగ్గరవడం జరిగితే చట్టం కఠినంగా వ్యవహరిస్తుంది. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం సోషల్ మీడియా తీర్పులు. కేసు కోర్టులో ఉండగానే ఒకరిని హీరోగా, మరొకరిని విలన్‌గా చూపించడం చట్టపరంగా కూడా ప్రమాదకరం. ఎందుకంటే చివరి తీర్పు చెప్పేది సోషల్ మీడియా కాదు... కోర్టు మాత్రమే. సీనియర్ న్యాయవాదుల అభిప్రాయం ప్రకారం, ఇలాంటి అంశాల్లో కుటుంబాలు, యువత, సమాజం మరింత బాధ్యతగా వ్యవహరించాలి. భావోద్వేగాల కంటే చట్టపరమైన అవగాహన ముఖ్యమని వారు సూచిస్తున్నారు. చివరికి ఒక విషయం మాత్రం స్పష్టం వదంతులు కాదు... ఆధారాలే చట్టానికి ముఖ్యం. అరుపులు కాదు... నిజాలే కోర్టులో నిలబడతాయి.

### బండి సాయి భగీరథ అంశంలో ఆరోపణలే... తుది తీర్పు కావు


ఆధారాలు ఉంటే శిక్ష తప్పదు... లేకపోతే తప్పుడు ప్రచారం చేసిన వారిపైనా చర్యలు... తెలంగాణలో చర్చనీయాంశంగా మారిన బండి సాయి భగీరథ వ్యవహారంపై సోషల్ మీడియాలో, రాజకీయ వేదికల్లో జరుగుతున్న ప్రచారంపై న్యాయ నిపుణులు కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. ప్రస్తుతం బయటకు వస్తున్నవి కేవలం ఆరోపణలు మాత్రమేనని, అసలు నిజానిజాలు పోలీసులు దర్యాప్తు, కోర్టు విచారణ తరువాతే తేలుతాయని ఒక సీనియర్ న్యాయవాది స్పష్టం చేశారు. ఏ వ్యక్తిపైనైనా ఆరోపణలు రావచ్చు. కానీ ఆరోపణలు వచ్చాయని మాత్రమే అతను నేరస్థుడిగా మారిపోడు. చట్టం ముందు ఆధారాలకే విలువ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కేసులో స్పష్టమైన ఆధారాలు ఉంటే ఎవరైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని, అదే సమయంలో ఆధారాలు లేకుండా వ్యక్తిత్వ హననం చేసే విధంగా ఆరోపణలు చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

ప్రస్తుతం సోషల్ మీడియాలో బండి సాయి భగీరథపై అనేక పోస్టులు, వీడియోలు, కామెంట్లు వైరల్ అవుతున్నాయి. కొన్ని పోస్టులు వ్యక్తిగత పరువును దెబ్బతీసేలా, అవమానకరంగా ఉన్నాయని న్యాయవాది అభిప్రాయపడ్డారు. "ఒక వ్యక్తిపై విచారణ పూర్తికాకముందే అతనిని దోషిగా ప్రకటించడం సరైంది కాదు. అసత్య ప్రచారం, పరువు నష్టం, కించపరిచే వ్యాఖ్యలపై సంబంధిత వ్యక్తి కోర్టును ఆశ్రయించే హక్కు ఉంది" అని చెప్పారు.

ఇంకా సోషల్ మీడియాలో నిరాధార సమాచారం ప్రచారం చేయడం, మార్ఫింగ్ ఫోటోలు, అసభ్యకర పోస్టులు, దూషణాత్మక కామెంట్లు పెట్టడం వంటి అంశాలు కూడా సైబర్ చట్టాల పరిధిలోకి వస్తాయని తెలిపారు. అవసరమైతే పరువు నష్టం కేసులు, సైబర్ క్రైమ్ ఫిర్యాదులు నమోదు చేసే అవకాశముందని పేర్కొన్నారు. సోషల్ మీడియా యుగంలో ప్రతి అంశాన్ని సంచలనంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని, కానీ చివరికి గెలిచేది ఆధారాలతో నిలిచే నిజమేనని న్యాయవర్గాలు సూచిస్తున్నాయి. "కోర్టు తీర్పు రాకముందే సోషల్ మీడియా తీర్పులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు" అని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రెజ్లింగ్ నేపథ్యంలో పెద్ది మూవీ

**దంగల్‌తో పోల్చకుండా జాగ్రత్తలు**




ప్రస్తుతం రామ్ చరణ్ అభిమానులు ఎదురుచూస్తోన్న చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. ఈ నేపథ్యంలో తాజాగా 'పెద్ది' ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా ఓ ఇంటర్వ్యూలో మేకింగ్ విశేషాలు పంచుకున్నారు. ఈ సినిమా కూడా కుస్తీ (రెజ్లింగ్) నేపథ్యంలో సాగుతుంది. దీంతో ఇది బాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'దంగల్'ను గుర్తుచేయకుండా ఉండటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు 'దంగల్' సినిమా అస్సలు గుర్తుకు రాకూడదనేది మా టీం ముందున్న అతిపెద్ద సవాలు. అందుకే సెట్ వర్క్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఎక్కడా దంగల్‌ను పోలిన సెట్‌లు వేయలేదు. అలా ఉండకూడదనేదే ప్రధాన ఉద్దేశంగా పని చేశాం. ప్రేక్షకులు ఇదివరకే ఇలాంటి సెట్స్ చూశామనే భావన కలగకుండా ఉండటానికి మేము ఎన్నో ప్రయోగాలు చేశాం. 'పెద్ది'లో కొన్ని కొత్త ఆలోచనలు కూడా చేశాం' అని అవినాశ్ కొల్లా చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ స్క్రిప్ట్ అని, ఇలాంటి గొప్ప చిత్రానికి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని తెలిపారు. కథలోని ఎమోషన్‌ను ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా చేయడంలో తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు.


# బన్నీతో మరోమారు జతకట్టనున్న పూజా



బుట్టబొమ్మ పూజా హెగ్డే కు అదృష్టం పట్టిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. పూజా వరుసగా అరడజను సినిమాలు డిజాస్టర్ అందుకున్నాయి. ఈ లెక్కన పూజా హెగ్డే పేరు కూడా ఎక్కడా వినిపించ కూడదు. కానీ, అదేంటో ఈ చిన్నది వరుస ఫ్లాపులను అందుకున్నా అవకాశాలు మాత్రం కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం పూజా చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. ఇప్పటికే ఆమె నటించిన జననాయగన్ రిలీజ్ కి సిద్ధమవుతోంది. ఇది కాకుండా హిందీలో వరుణ్ ధావన్ సరసన తేరా హో జాన్ సినిమాలో పూజా నటిస్తోంది. ఇందులో అమ్మడి అందాల ఆరబోత చూసి ఫ్యాన్స్ షాక్ అవుతున్నారు. ఇక ఇప్పుడు పూజా మరో లక్కీ ఛాన్స్ ని పట్టేసిందని సమాచారం. అల్లు అర్జున్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెల్సిందే. కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ నటిస్తోన్న రాకా శరవేగంగా షూటింగ్ జరుపుకొంటుంది. దీని తరువాత బన్నీ, మరో కోలీవుడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ డైరెక్షన్ లో ఒక సినిమా చేయనున్న విషయం తెల్సిందే. ఈ చిత్రంలో బన్నీకి జోడిగా పూజా హెగ్డే పేరును అనుకుంటున్నారట. ఇప్పటికే బన్నీతో దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో లాంటి సినిమాల్లో నటించింది. ఇక ఇప్పుడు ముచ్చటగా మూడోసారి ఈ జంట రొమాన్స్ చేయనున్నారు. త్వరలోనే లోకేష్ .. పూజాను అధికారికంగా సినిమాలోకి ఆహ్వానించనున్నాడట. అయితే పూజా అదృష్టం బానే ఉన్నా.. మార్కెట్ పరంగా బన్నీకి రిస్క్ అని కొందరు చెప్పుకొస్తున్నారు.



# శ్రీను వైట్లతో శర్వానంద్ మూవీ



టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రస్తుతం వరుస విజయాలతో మంచి జోష్‌లో ఉన్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' కుటుంబ ప్రేక్షకులను అలరించి బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. అలాగే ఇటీవల విడుదలైన మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో తెరకెక్కిన 'బైకర్' కూడా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందింది. ఈ విజయాల ఊపుతో శర్వానంద్ ఇప్పుడు వరుసగా విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంలో శర్వానంద్ నటిస్తున్నారు. 1960ల నాటి నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా కనిపించనున్నారు. ఈ సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ఇప్పుడు శర్వానంద్ తన తదుపరి చిత్రాన్ని హాస్య కథా చిత్రాల దర్శకుడు శ్రీను వైట్లతో చేయడానికి సిద్ధమైనట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో శ్రీను వైట్ల మార్క్ కామెడీకి తోడు 'కాలయానం' అనే వైవిధ్యమైన అంశాన్ని జోడిస్తున్నట్లు సమాచారం. హాస్యంతో పాటు సైన్స్ ఫిక్షన్ అంశాలు కలిస్తే ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతి కలుగుతుందని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొదట ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల వారు ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని సమాచారం. ఇప్పుడు ఈ చిత్రాన్ని నిర్మాత అనిల్ సుంకర తన నిర్మాణ సంస్థ ద్వారా నిర్మించబోతున్నట్లు తెలుస్తోంది. '

# విడాకులకపై నటి మౌనీ రాయ్ చిరాకు


## అవాస్తవ ప్రచారాలు ఆపాలని పోస్ట్



తన భర్త సూరజ్ నంబియార్‌తో విడిపోతున్నట్టుగా వచ్చిన రూమర్లపై నటి మౌనీరాయ్ స్పందించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకోవాలని సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. మౌనీరాయ్, సూరజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు అన్‌ఫాలో కావడంతో విడిపోతున్నారన్న ప్రచారం జరగ్గా నటి రియాక్ట్ అయ్యారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీరాయ్ కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు, సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అకౌంట్‌ను డిలీట్ చేసినట్టు సమాచారం. 2022 జనవరిలో సూరజ్ నంబియార్- మౌనీరాయ్ వివాహం జరిగింది. 'నాగిని' సీరియల్‌తో ఆకట్టుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'బ్రహ్మాస్త్ర' తదితర సినిమాల్లో నటించారు. 'కేజీయఫ్ చాప్టర్ 1' (కన్నడ), 'వేదా' (హిందీ) తదితర చిత్రాల్లో స్పెషల్ సాంగ్స్‌తో అలరించారు.

## సమంత 'మా ఇంటి బంగారం'

# కొత్త రిలీజ్ డేట్..



స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఫీమేల్ సెంట్రిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుండటంతో సినీ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. దీంతో అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటనతో క్లారిటీ ఇచ్చింది.మా ఇంటి బంగారం' చిత్రాన్ని జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంప్రదాయ పట్టుచీరలో కనిపిస్తున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్, పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది.

# కన్నడసీమలో తీవ్ర విషాదం

**గుండెపోటుతో నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ మృతి**




కన్నడ చిత్రపరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నటుడు, నిర్మాత దిలీప్ రాజ్ (47) బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. బెంగళూరులోని తన నివాసంలో ఉన్న సమయంలో ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దిలీప్ రాజ్ మృతితో శాండల్‌వుడ్ దిగ్భ్రాంతికి గురైంది. ఈ వార్త తెలుసుకున్న 'కాంతార' నటుడు రిషబ్ శెట్టి సోషల్ మీడియా వేదికగా దిలీప్ రాజ్‌కు నివాళులు అర్పించారు. 'ఒక మంచి నటుడు, దర్శకుడు, నిర్మాత.. అన్నింటికీ మించి ఒక అద్భుతమైన మనిషి. మనం కలిసిన సందర్భాలు తక్కువైనా, మీ వ్యక్తిత్వం నా గుండెల్లో ఎప్పటికీ చెరగని ముద్ర వేసింది. మీ ఆత్మకు శాంతి చేకూరాలి' అంటూ రిషబ్ శెట్టి ఎమోషనల్ పోస్ట్ చేశారు.

దిలీప్ రాజ్ కేవలం నటుడిగానే కాకుండా నిర్మాతగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా కన్నడ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పునీత్ రాజ్‌కుమార్ నటించిన 'మిలనా' చిత్రంలో ఆయన పోషించిన ప్రతినాయకుడి పాత్ర ఆయన కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచింది. 'యు-టర్న్', 'బాయ్‌ఫ్రెండ్' వంటి పలు విజయవంతమైన సినిమాలతో పాటు 'హిట్లర్ కళ్యాణ' వంటి పాపులర్ సీరియల్స్‌లోనూ ఆయన నటించారు.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com